క్లుప్తంగా

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



ఆత్మకూరు: స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని వడ్డెర ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరులో శనివారం నిర్వహించారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ నాయకులు మాధవ, చల్లా సుధాకర్, వల్లెపు వెంకటేశ్వర్లు, కోటకొండ విజయ్‌కుమార్, మల్లి సుధాకర్, ఇర్ల మౌలి, హరీష్, దొరబాబు, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



దుత్తలూరు: నర్రవాడ బీసీ కాలనీకి చెందిన సవరం వెంగయ్య కుటుంబానికి న్యాయవాది శ్రీనివాసులు రూ.30వేలు నగదు సాయం అందజేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గిరిజనుడైన వెంగయ్య మరణించడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని బీజేపీ నాయకుడు మేకపాటి మాల్యాద్రినాయుడు తన మిత్రుడు న్యాయవాది శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లి రూ.30 వేలు సాయాన్ని ఎస్సై ఆదిలక్ష్మి చేతుల మీదుగా శనివారం అందజేశారు. తెడ్డుపాడు సర్పంచ్ బోయపాటి వెంకటరత్నం, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థుల దాతృత్వం



కలిగిరి: మండలంలోని సిద్ధనకొండూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని పాఠశాల వాచ్‌మెన్ మాలకొండయ్య, ఆయా మల్లేశ్వరమ్మ, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు చిన్నికు నూతన వస్త్రాలను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



అల్లూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పుట్టినరోజును పురస్కరించుకుని ఆ పార్టీ మండల నాయకుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు తిప్పిరెడ్డి వెంకటచలమారెడ్డి, నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ తిప్పిరెడ్డి నారపరెడ్డి శనివారం దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంక్రాంతిని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేసిన తిప్పిరెడ్డిని అభినందించారు. ఉన్నత స్థితిలో ఉన్న వారే కాకుండా ప్రతిఒక్కరూ పేదలకు ఎంతో కొంత సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, గున్నం ప్రసాద్‌రెడ్డి, యల్లాల రఘురామిరెడ్డి, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

కలిగిరి: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో కలిగిరి షటిల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆషిక్, హుమయూన్ శనివారం తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15,116, ద్వితీయ బహుమతిగా రూ.10,116, తృతీయ బహుమతిగా రూ.7,116, నాల్గో బహుమతిగా రూ.5,116 చొప్పున అందజేయనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 70750 94076, 92810 47539 నంబర్లను సంప్రదించాలని కోరారు.



వరినాట్లు వేస్తున్న కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు
- వ్యవసాయ పనులకు కూలీల కొరత
- 2014లో అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చిన టీడీపీ
- ఆ మేరకు అనుసంధానం చేయాలని రైతుల డిమాండ్

వ్యవసాయానికి ఉపాధి అనుసంధానమయ్యేనా?

సీతారామపురం: ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధించాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నాయే తప్ప అమలు చేయడం లేదు. కూలీలు ఎక్కువగా ఉపాధిహామీ పనులకు వెళుతుండటంతో వ్యవసాయ పనులకు కొరత ఏర్పడుతోంది. దీంతో కూలి రేట్లు పెరగడంతో పాటు సకాలంలో వ్యవసాయ పనులు పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని 37 మండలాల్లో 2.78 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 4.38 లక్షల మంది కూలీలుగా నమోదై ఉన్నారు. అందులో రోజూ సుమారు లక్ష మంది వరకు ఉపాధి పనులకు వెళుతున్నారు. దీంతో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. యంత్ర పరికరాలు ఎన్ని అందుబాటులోకి వచ్చినా చాలా పనులు కూలీల ద్వారానే చేయించాల్సి ఉంటుంది. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఊరట కలుగుతుంది. రైతులపై కూలీల ఖర్చుల భారం కూడా కాస్త తగ్గుతుంది. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చి విస్మరించింది. ప్రస్తుతం బీజేపీ, జనసేనతో కలిసి అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎందుకో ఆ హామీని అమలుచేసే దిశగా ముందుకు మాత్రం వెళ్లడం లేదు. జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పలు రకాల పంటలు సాగుచేస్తుంటారు. రైతులు వారి స్థోమతకు మించి మెట్ట ప్రాంతాల్లో బీడు భూములు ఉండకూడదని వ్యవసాయం చేస్తుంటారు. అందులో వచ్చిన ఆదాయంతో జీవనం సాగిద్దామనే ఆశతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయంలో పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో తరచూ నష్టాలే మిగులుతున్నాయి. వరి, వేరుశనగ సాగుచేస్తున్న రైతులు విత్తనాలు చల్లడం, కోతలు, నూర్పిళ్లు, తదితర పనులకు ఎకరా సాగుకు దాదాపు రూ.25వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ఉపాధికి వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేస్తే కూలీల కొరతతో పాటు పెట్టుబడి ఖర్చులు కూడా రైతులకు తగ్గుతాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసి ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని రైతాంగం కోరుతోంది.

రైతులకు ప్రయోజనం



ఉపాధిహామీకి వ్యవసాయ రంగానికి అనుసంధానిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంట సాగు రైతులకు భారంగా మారింది. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నప్పటికీ లాభాలు మాత్రం రావడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి. లేదంటే రైతులు వీధుల పాలవుతారు.

–పెంచలయ్య, రైతు, దేవిశెట్టిపల్లి

కష్టాలను గుర్తించాలి



ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలి. దాని వలన రైతులతో పాటు కూలీలకు కూడా మేలు జరుగుతుంది. ప్రస్తుతం వ్యవసాయంలో కనీసం పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో రైతన్నలు నష్టాల్లో కూరుకుపోతున్నారు.

–దత్తాత్రేయ, అయ్యవారిపల్లి, రైతు

అప్పుల పాలవుతున్నాం



రైతులకు పంటల సాగు భారంగా మారింది. వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడులు కూడా దక్కడం లేదు. పెట్టిన ఖర్చులు కూడా రాకపోగా అప్పుల పాలవుతున్నాం. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. అప్పుడే కూలీల భారం తగ్గుతుంది.

–రమణయ్య, పోలంగారిపల్లి, రైతు

శబరిమలకు తరలిన అయ్యప్పలు



సీతారామపురం: మండలానికి చెందిన అయ్యప్ప భక్తులు శనివారం శబరిమలకు తరలివెళ్లారు. సీతారామపురంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఇరుముడులు ధరించి ఊరేగింపుగా ఎల్‌వీఆర్ కళాశాల వద్దకు చేరుకుని ప్రత్యేక వాహనాల్లో శబరిమలకు బయలుదేరి వెళ్లారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై రఘునాథ్

ఉదయగిరి/వరికుంటపాడు: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా కోడిపందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఉదయగిరి, వరికుంటపాడు ఎస్సైలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, రఘునాథ్ హెచ్చరించారు. శనివారం వారు స్థానిక పోలీసు స్టేషన్లలో విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండగను ఆనందోత్సాహాలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. సంప్రదాయబద్ధమైన క్రీడలు నిర్వహించుకోవాలని తెలిపారు. బండలాడుడు పోటీలు నిర్వహిస్తే ముందుగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. పండుగ మూడురోజులు గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఉదయగిరి: ఉదయగిరి దుర్గం సమీపంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సీఐ ఎస్ వెంకట్రావు, ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తమ సిబ్బందితో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులతో పాటు రూ.4 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు జూదరులు పరారయ్యారు. త్వరలో పరారైన జూదరులను పట్టుకుని కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

మినీగోకులాలను సద్వినియోగం చేసుకోవాలి



పాలిటెక్నిక్ కళాశాలలోని భవనాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

అనుమసముద్రంపేట: మినీగోకులాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. మండలంలోని జమ్మవరంలో శనివారం ఆయన పర్యటించారు. సిమెంట్‌రోడ్లతో పాటు మినీగోకులాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల కోసం మినీగోకులాలను మంజూరు చేస్తోందని తెలిపారు. అందులో భాగంగా జమ్మవరం రూ.5లక్షలతో నిర్మించిన మినీగోకులాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జమ్మవరంలో రూ.15లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఆయన వెంట ఆనం కైవల్యారెడ్డి, తాళ్లూరి గిరినాయుడు, కాటం నారసింహారెడ్డి, పులిమి సుధాకర్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరులో బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో తాత్కాలిక భవన వసతిని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శనివారం రాత్రి పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఉన్న నూతన భవనంలో తాత్కాలికంగా బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించి అవసరమైన వసతుల కల్పనపై బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్‌తో ఫోన్‌లో సంప్రదించారు. బాలికలకు కావాల్సిన డైనింగ్ టేబుళ్లు, మంచాలు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలను స్వయంగా పరిశీలించాలని డైరెక్టర్‌కు సూచించారు. ఈ విషయమై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి లోపాలు లేకుండా అన్ని వసతులు ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఆయన ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని పరిశీలించారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహం మరమ్మతులకు గురికావడంతో దాని స్థానంలో నూతన భవన నిర్మాణానికి రూ.85 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, గురుకులం ప్రిన్సిపల్, టీడీపీ నాయకులు ఉన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

ఉదయగిరి: సంక్రాంతిని పురస్కరించుకుని దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి సాధారణ సర్వీసులతో పాటు అదనంగా 8 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి నుంచి హైదరాబాదుకు 4, బెంగుళూరుకు 3, చెన్నైకు 1 చొప్పున అదనపు సర్వీసులు నడుపుతున్నామని వివరించారు. ప్రత్యేక సర్వీసుల్లో సాధారణ చార్జీలు మాత్రమే ఉంటాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి డీవైఎఫ్ఐ సంక్రాంతి క్రీడా పోటీలు

ఆత్మకూరు: డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడా పోటీలను ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్, ఫుట్‌బాల్, షటిల్, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు.

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుల నియామకం



బోయిళ్ల మాలకొండారెడ్డి



పందిళ్లపల్లి సుబ్బారెడ్డి



నాగులపాటి ప్రతాప్‌రెడ్డి



చెన్ను వెంకటేశ్వరరెడ్డి



పులగం శంకర్‌రెడ్డి



బిజివేముల పిచ్చిరెడ్డి



దండా కృష్ణా రెడ్డి



బీద రమేష్

ఆత్మకూరు/అనుమసముద్రంపేట/ సోమశిల/చేజర్ల/మర్రిపాడు/సంగం: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులుగా పలువుర్ని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆత్మకూరు పట్టణాధ్యక్షుడిగా నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, అనుమసముద్రంపేట మండలాధ్యక్షుడిగా పదిళ్లపల్లి సుబ్బారెడ్డి, అనంతసాగరం మండలాధ్యక్షుడిగా బిజివేముల పిచ్చిరెడ్డి, సంగం మండలాధ్యక్షుడిగా పులగం శంకర్‌రెడ్డి, చేజర్ల మండలాధ్యక్షుడిగా బోయిళ్ల మాలకొండారెడ్డి, మర్రిపాడు మండలాధ్యక్షుడిగా చెన్ను వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అందరిని సమన్వయం చేసుకుని మండలాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

- **అల్లూరు:** వైఎస్సార్‌సీపీ అల్లూరు నగర పంచాయతీ అధ్యక్షుడిగా దండా కృష్ణారెడ్డి, అల్లూరు రూరల్ అధ్యక్షుడిగా బీద రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.



వాసుదేవరెడ్డి

దుత్తలూరు: వైఎస్సార్‌సీపీ దుత్తలూరు మండల కన్వీనరుగా దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి వరుసగా రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా వాసుదేవరెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



మర్రిపాడు మండలం చుంచులూరులో పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు



ఆత్మకూరు మండలం సాతానుపల్లిలో..



ఉదయగిరి: వెంగళరావునగర్‌లో..



వింజమూరులో..

మర్రిపాడు : మండలంలోని చుంచులూరులో కంచి వెంకటసుబ్బయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌ను విశ్రాంత ఎంఈఓ జొన్నా సత్యనారాయణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నిష్‌బిట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత పడచల నాగేశ్వరరావు టాస్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా క్రీడాపోటీలు నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. గ్రామ పెద్దలు కలిశెట్టి వెంకటరమణయ్య, దువ్వూరు జయదేవ్, ఇరుకుమారి మురళి, యలగాల వెంకటేశ్వర్లు, బత్తలపల్లి రోశిరెడ్డి, కలిశెట్టి రాజేంద్రకుమార్, నాగరాజు, జొన్న రాగదీప్, మురళి, కృష్ణమాచార్యులు, వెంకటరాయులు పాల్గొన్నారు.

సాతానుపల్లిలో ప్రీమియర్ లీగ్ ప్రారంభం

ఆత్మకూరురూరల్: మండలంలోని సాతానుపల్లిలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించారు. గత పదేళ్లుగా సంక్రాంతి సందర్భంగా సాతానుపల్లి యూత్ పర్యవేక్షణలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కిరణ్, రవి, రేవతి తెలిపారు. పదో వార్షికోత్సవం సందర్భంగా విజేత జట్టుకు రూ.50వేలు, రన్నర్‌జట్టుకు రూ.20వేలు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో మొత్తం 30 జట్లు పోటీపడుతున్నాయని తెలిపారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ప్రముఖ న్యాయవాది నందా ఓబులేసు, టీడీపీ నాయకుడు దావా పెంచలరావు, మాల్దీవుల ఆర్‌టీడీ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జ్యోతిగిరి, ఉత్తర కాలువ వైస్‌చైర్మన్ పోనుగుంట ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్‌లో సంక్రాంతిని పురస్కరించుకుని ముత్యాలపాటి ఖాదర్‌సాహెబ్ జ్ఞాపకార్థంగా మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన కుమారుడు హనీఫ్ శనివారం ప్రారంభించారు. మండలస్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేలు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజామొహిద్దీన్, గ్రామస్తులు ఖాదర్‌బాషా, రియాజ్, మంజూర్, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరులో..

వింజమూరులోని ఎంఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో క్రికెట్ టోర్నమెంట్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లాల కొండారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. 14 ఏళ్లుగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. విజేత జట్టుకు రూ.30,116, రన్నర్ జట్టుకు రూ.17,116 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్ తాటిచెట్ల కాలేషా పాల్గొన్నారు.

ఏఎస్ఎస్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

చేజర్ల: సంక్రాంతిని పురస్కరించుకుని టీకేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఏఎస్ఎస్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. విజేత జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ.15 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులునాయుడు, కొమ్మి రమేష్ నాయుడు, నిర్వాహకులు మారెళ్ల శివ, పెండెం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

ఉదయగిరి: రైతుసేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని జిల్లా రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కృష్ణంపల్లి, బిజ్జంపల్లి, లింగమనేనిపల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై శ్రద్ధ చూపకపోవడంతో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి రావడంతో నష్టాల పాలవుతున్నారన్నారు. గతేడాది 75 కేజీల ధాన్యం బస్తాను రూ.2,500కు కొనుగోలు చేయగా, ప్రస్తుతం రూ.1400కు కూడా కొనేవారు లేరన్నారు. ఎన్నికల హామీ మేరకు రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

వింజమూరు అభివృద్ధికి అన్ని విధాలా కృషి



మినీగోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు(ఉదయగిరి): వింజమూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. వింజమూరులోని నడిమూరులో ప్రభుత్వ సహకారంతో ఓ రైతు నిర్మించుకున్న మినీగోకులాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వింజమూరును మున్సిపాలిటీగా మార్చడంతో పాటు ప్రత్యేకంగా ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. రాబోయే పదేళ్లలో వింజమూరు పట్టణ స్వరూపం మారే విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గానికి 200 మినీ గోకులాలు మంజూరయ్యాయని, రైతులు త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. ప్రజలకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నేతలు జీ రఘునాథరెడ్డి, ఎంపీటీసీ వనిపెంట హైమావతి, మాజీ సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, బీజేపీ మండలాధ్యక్షుడు దేగా మధు, తదితరులు పాల్గొన్నారు.